

# మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట




శ్రమదానం చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

## గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

### వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 13 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలన్నింటినీ అభివృద్ధి పథంలో నడిపించేందుకు కాంగ్రెస్ పార్టీ అనేక సంక్షేమ పథకాలను చేపట్టి ముందుకెళ్తోందని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వనపర్తి మండలం పెద్దగూడెం గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణం పనులను ప్రారంభించారు. సి సి రోడ్డు నిర్మాణం నాణ్యవంతంగా ఉండాలని అధికారులకు సూచించారు. అనంతరం గ్రామంలో అంతర్గత డ్రైనేజ్ నిర్మాణానికి ఆయన పనులను ప్రారంభించారు. విద్యార్థులతో శ్రమదానం వనపర్తి మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్‌సిసి క్యాంపులో భాగంగా పెద్దగూడెం గ్రామంలో వారి సేవలను కొనసాగిస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే గారు విద్యార్థులతో కలిసి కాసేపు శ్రమదానం చేశారు. విద్యార్థులు – మిగతా4లో..



మొల్ల విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

## కవయిత్రి మొల్లను ఆదర్శంగా తీసుకోవాలి

### విద్యార్థులకు చదువుతోపాటు నైపుణ్య శిక్షణ అవసరం : ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్‌బ్యూరో, మార్చి 13 ప్రభాతవార్త:** కవయిత్రి మొల్లను మహిళలు ఆదర్శంగా తీసుకోవాలని మహబూబ్‌నగర్‌ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కవయిత్రి మొల్ల జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ లో ఉన్న మొల్ల విగ్రహానికి ఆయన పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మొల్ల ఆదర్శ మహిళ అని, 16వ శతాబ్దంలోనే విద్యకు ప్రాధాన్యత ఇచ్చిన గొప్ప కవయిత్రి అని తెలిపారు. రామాయణం టీవీ సీరియల్ నిర్మాణ సమయంలో ప్రామాణిక గ్రంథాలుగా తీసుకున్న వాటిలో రంగనాథ రామాయణంతో పాటు మొల్ల రచించిన మొల్ల – మిగతా4లో..

### ఏసీబీ వలలో

## పంచాయతీ కార్యదర్శి

**అయిజ మార్చి 13,ప్రభాతవార్త:** మండల పరిధిలోని విక్లాస్పురం గ్రామపంచాయతీ కార్యదర్శి బోయ రంగన్న లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకి చిక్కిన సంఘటన శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏసీబీ అధికారి డిఎస్పి సిహెచ్ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఏక్లాస్ పురం గ్రామానికి చెందిన ఫిర్యాదుదారుని భార్యకు సంబంధించిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సంబంధించిన మొదటి వాయిదా మొత్తాన్ని విడుదల చేయడానికి అలాగే మిగిలిన మూడు వాయిదాలు ఎటువంటి అంతరాయం లేకుండా మంజూరు చేయించడానికి యజమాని దగ్గర 20,000 లంచం డిమాండ్ చేయగా వారు వాయిదాల ప్రకారం 15 వేల రూపాయలు బేరం కుదురుచున్నట్టు తెలిపారు. ఆ నగదును శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి స్వీకరిస్తున్న సమయంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పంచాయతీ కార్యదర్శిని రెడ్ యాండెడ్‌గా పట్టుకున్నట్లు వారు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి కార్యదర్శి రంగన్నను రిమాండ్ తరలిస్తున్నట్టు వారు తెలిపారు అలాగే ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం అడిగితే ఏసీబీ అధికారులకు సమాచారం అందించాలని వారు తెలిపారు. అందించిన వారి సమాచారాన్ని గోప్యంగా ఉంచుతామని మీడియా ముఖంగా ప్రజలకు తెలిపారు.



లంచం తీసుకుంటు దొరికిన పంచాయతీ కార్యదర్శి

## డే కేర్ సెంటర్లో అన్ని వసతులను కల్పించాలి

### జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి ప్రతినిధి, మార్చి 13 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలో వృద్ధుల కోసం ఏర్పాటు చేసిన డే కేర్ సెంటర్లో వారికి కావాల్సిన అన్ని వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ వనపర్తి పట్టణంలోని రామ్ నగర్ లో ఏర్పాటు చేసిన సీనియర్ సిటిజన్ డే కేర్ సెంటర్ ప్రణామ్" ను సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఉన్న వసతులను పరిశీలించి, అక్కడే ఉన్న పలువురు సీనియర్ సిటిజన్లతో మాట్లాడారు. సీనియర్ సిటిజన్లకు –మిగతా4లో..



వృద్ధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

### ఆర్థిక ఇబ్బందులున్నా

# సంక్షేమం ఆపలే..



జడ్చర్ల మున్సిపాలిటీ నూతన భవనం ప్రారంభిస్తున్న రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి

- ◆ రూ.8లక్షల కోట్ల అప్పుల ఊబిలోకి నెట్టిన బిఆర్ఎస్
- ◆ ఏడాదికి రూ. 75,000 కోట్ల వడ్డీ చెల్లిస్తున్నాం
- ◆ రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- ◆ జడ్చర్ల మున్సిపాలిటీ నూతన భవనం ప్రారంభోత్సవం

**జడ్చర్ల, మార్చి 13 ప్రభాతవార్త :** జడ్చర్ల పట్టణం బాదేపల్లిలో నూతనంగా నిర్మించిన జడ్చర్ల పురపాలక సంఘం కార్యాలయం భవనాన్ని శుక్రవారం రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక శాఖ, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జడ్చర్ల శాసన సభ్యులు అనిరుధ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జడ్చర్ల పురపాలక సంఘం కౌన్సిలర్లు, ఛైర్పర్సన్, మున్సిపల్ అధికారులకు, జడ్చర్ల ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గత రెండు సంవత్సరాలుగా అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. గత పది సంవత్సరాల బిఆర్‌యస్ పాలనలో రాష్ట్రాన్ని రూ.8 లక్షల కోట్ల రూపాయల అప్పుల ఊబిలోకి నెట్టారని, ఆ అప్పులకు ప్రతి సంవత్సరం సుమారు రూ. 75,000 కోట్ల వడ్డీ చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. రాష్ట్రం ఎన్ని ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటునప్పటికీ , ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రభుత్వం పేద ప్రజలకు ఇచ్చిన హామీలకు అనుగుణంగా గత రెండు సంవత్సరాలలో అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తోందని మంత్రి చెప్పారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం రూ.500కే గ్యాస్ సిలిండర్, గృహ జ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి నాణ్యమైన ఉచిత సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రైతులకు ..2 లక్షల వరకు రుణమాఫీ, సన్న రకం వడ్లు పండించే రైతులకు క్వింటాల్‌కు రూ.500 ప్రోత్సాహకం, రైతు భరోసా, రైతు బీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఇవే కాకుండా ఇంకా అనేక కార్యక్రమాలు చేయాల్సి ఉందని ఆయన అన్నారు. దానికి ప్రజల మద్దతు కావాలని అన్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో, అలాగే మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎన్నుకొని మరొక్కసారి వారి విశ్వాసాన్ని మా పార్టీ మీద చూపారు. అదే ప్రోత్సాహంతో మా ప్రభుత్వం గ్రామాలలో పేద ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు సమర్ధవంతంగా అందేలా చేయడానికి 99 రోజుల ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నదని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి అట్టడుగు పేద ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా కృషి చేయాలని మంత్రి సూచించారు. ఈ సందర్భంగా జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి మాట్లాడుతూ పురపాలక సంఘం కార్యాలయ ప్రారంభోత్సవానికి – మిగతా4లో..



మంత్రి, ఎమ్మెల్యేతో పాటు మున్సిపల్ ఛైర్‌పర్సన్ కోనేటి పుష్పలత, కౌన్సిలర్లు



పదవ తరగతి పరీక్షలు రాయనున్న విద్యార్థులు (ఫైల్)

## ఆల్ ది బెస్ట్..

### నేటినుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం

### మహబూబ్‌నగర్ జిల్లాలో 60 కేంద్రాలు ఏర్పాటు

### పరీక్షలు రాయనున్న 13217 మంది విద్యార్థులు

### ఏర్పాట్లు పూర్తి చేసిన అధికార యంత్రాంగం

**మహబూబ్‌నగర్ బ్యూరో, మార్చి 13 ప్రభాతవార్త :** నేటి నుంచి పదవ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వార్షిక పరీక్షలు 2026 మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు జరగనున్నాయి. ఉదయం 9:30 గంటల నుండి 12:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 60 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 13217 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. విద్యార్థులు పరీక్షా సమయానికి గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి, 9:35 తిలీ తర్వాత అనుమతించరు. జిల్లా యంత్రాంగం పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.



అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

**ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి..**

విద్యార్థులు ఎలాంటి భయం,ఆందోళన పడకుండా, ధైర్యంగా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి. పరీక్షలకు ముందు సరైన ప్రణాళికతో చదవడం, సమయపాలన పాటించడం చాలా ముఖ్యం. విద్యార్థులు ఇప్పటి వరకు చదివిన చదువు పై నమ్మకం ఉంచి ప్రశాంతంగా పరీక్షలు రాస్తే మంచి మార్కులతో ఫలితాలు సాధించగలరు. అలాగే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ వారికి అనుకూలమైన వాతావరణం కల్పించాలి.

## తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు స్వాగతం

### - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మార్చి 13 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా కుటుంబ సమేతంగా కలిసి శ్రీశైల భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను దర్శించుకునేందుకు హైదరాబాద్ నుండి నేరుగా రోడ్డు మార్గాన శ్రీశైలం దర్శనానికి వెళ్తూ మార్గమధ్యంలో నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మున్ననూర్ గ్రామ పరిధిలో ఉన్న తెలంగాణ టూరిజం మృగవాణి గెస్ట్ హౌస్‌కు శుక్రవారం సాయంత్రం చేరుకున్న రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు నాగర్‌కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ గణపట్ రావు పాటిల్ పుష్పగుచ్చంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. కాసేపు విరామం తర్వాత నేరుగా శ్రీశైలం దర్శనానికి బయలు దేరి వేళ్ళారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

## కస్తూర్బా విద్యాలయంలో మెనూ పాటించడం లేదు

- అందుబాటులో లేని ఫిర్యాదు బాక్సులు
- నాణ్యతలేని భోజనం, పురుగులు ఉన్న పప్పు దినుసులు
- అసంతృప్తి వ్యక్తం చేసిన ఫుడ్ కమిటీ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి

**ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త :** గురుకుల పాఠశాలలో నాణ్యమైన భోజనాన్ని అందించి విద్యార్థులు మంచి విద్య నందించాలని ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్థానికంగా ఉన్న అధికారుల నిరక్ష్య వైఖరితో కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థినిలకు అందిస్తున్న భోజనం నాణ్యత లేకపోవడంతో పాటు మెనూ ప్రకారం అందించడం లేదని జాతీయ ఆహారభద్రత చట్టం చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యురాలు శారదమ్మ అసంతృప్తి వ్యక్తం చేశారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల కస్తూరిబా గాంధీ విద్యాలయాన్ని వారు ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థినిలకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం, వారికి అందుతున్న వైద్యం పట్ల ఆరా తీశారు. అదేవిధంగా విద్యార్థులకు అందిస్తున్న పప్పుదినుసులను పరిశీలించగా పురుగుల తో నిండుకున్న పప్పు దినుసులు, కిచెన్ సామాను ఉండడంతో వారు తీవ్ర ఆఅసంతృప్తి వ్యక్తం చేశారు. ముఖ్యంగా జిల్లా స్థాయి, మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ లోపించడంతో ఇలా నాణ్యత లోపించిందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో విద్యార్థులకు ఏమైనా సమస్యలుంటే ఫిర్యాదు బాక్స్‌లో వెయ్యాలని నిబంధనలు ఉన్నప్పటికీ, దానికి విరుద్ధంగా ఫిర్యాదు బాక్సులు లేకపోవడం వారు జిల్లా కలెక్టర్‌కు వివరిస్తామని హెచ్చరించారు. విద్యార్థినిలు భోజనం చేయడానికి డైనింగ్‌హాల్ లేక భూమిపైన కూర్చొని వారు పడుకునే గదిలోనే కూర్చొని భోజనం చేస్తుండగా ప్రిన్సిపాల్ సైదను ప్రశ్నించారు. విద్యార్థినిలు భోజనాలు ఇలానే చేస్తారా? విద్యాలయసంస్థ కాదు పశువుల కొట్టంలా ఉందని ఇంత అద్వాన స్థితిలో కొనసాగుతుండం ఎంత దారుణమని చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులు చదువుకుంటున్న తరగతులు గదులకు వెళ్లి వారితో కొంతసేపు ముచ్చటించారు. విద్యార్థులలో ఆందోళన ఉన్నప్పటికీ వారు బయట చెప్పుకోలేకపోతున్నారని ఇక్కడి వాతావరణ పరిస్థితి చూస్తే అర్థమవుతుందని వారు అన్నారు. ప్రతి విద్యార్థికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేయాలని, మొక్కుబడి కాకుండా నిత్యం వైద్య సేవలు అందించాలని స్థానిక డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. తారా సింగ్ సూచించారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ఫుడ్ కమిటీ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిటీ సభ్యురాలు

**జిల్లా వైద్య శాఖ అధికారి ఎక్కడ...**

అచ్చంపేట నియోజకవర్గంలో శుక్రవారం జాతీయ ఆహార భద్రత చైర్మన్ పర్యటన ఉన్నప్పటికీ జిల్లా స్థాయి అధికారులు హాజరు కాకపోవడం ఎంతవరకు సమంజసం అని, రామ్ పర్యవేక్షణ చేస్తున్న సమయంలో జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు నిరక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. జిల్లా వైద్యాధికారి ఎందుకు రావడం లేదని అక్కడే ఉన్న డిప్యూటీ డిఎం హెచ్ ఓ డాక్టర్ తారా సింగ్‌ను ప్రశ్నించారు. ఫుడ్ కమిటీ చైర్మన్ పర్యటన ఉందని తెలిసినా హాజరు కాకపోవడం పట్ల వారు అగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో అద్వాన స్థితిలో నెలకొందని దీనిపై జిల్లా కలెక్టర్‌తో సమీక్షిస్తామని పేర్కొన్నారు. అనంతరం స్థానిక ఆసుపత్రిని సందర్శించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్ అయినప్పటికీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి సేవలు అందుతున్నాయని, 30 పడకల ఆసుపత్రికి సరిపడు భవనం ఉన్నప్పటికీ, అన్ని రకాల పరికరాలు వచ్చినప్పటికీ సిబ్బంది నియామకం లేకపోవడంతో వైద్య సేవలు కేవలం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారి నుంచి సేవలు అందుతున్నాయని గ్రామస్తులు, రోగులు చైర్మన్ ముందు వాపోయారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ భారత దేశంలో ఆకలి చావులతో అలమటిస్తున్న తెలంగాణ రాష్ట్రం 102 స్థానంలో ఉందని ఎన్ని చట్టాలు వచ్చినా అధికారుల పర్యవేక్షణ లోపించడంతో పూర్తిగా అద్వాన స్థితిలో వ్యవస్థ కొనసాగుతుందని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల వరకు పర్యవేక్షణ లోపించిందని అన్నారు. కస్తూర్బా గాంధీ విద్యాలయంలో మెనూ ప్రకారం అందించడం లేదని గుడ్లు, పప్పు దినుసులు, వంట సామాగ్రి నాణ్యత లోపించదని వీటిని నిర్వాణపట్ల జిల్లా స్థాయి నుంచి మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ పూర్తి గా లోపించిందని, విద్యార్థులకు మంచి భోజనం అందిస్తే వారి – మిగతా4లో..

### వినియోగదారులకు గ్యాస్ కొరత లేకుండా

## సరఫరా చేసేందుకు చర్యలు

### వివిధ అంశాలపై అధికారుల సమీక్షా...

**గద్వాల మార్చి 13, ప్రభాతవార్త :** గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ సిలిండర్లను కొరత లేకుండా వినియోగదారులకు సరఫరా చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు. గ్యాస్ సిలిండర్ల, రబీ పంటలకు సాగునీరు సరఫరా, వరి ధాన్యం కొనుగోలు అంశాలపై శుక్రవారం హైదరాబాదు నుంచి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రబీలో వివిధ ప్రాజెక్టుల పరిధిలో రైతులు సాగుచేసిన పంటలు ఎండిపోకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పంటల కోత వరకు లష్కర్ స్థాయి నుంచి సిఈ స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సాగునీటి సరఫరా విషయంలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు సంబంధిత నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ రైతుల పంటలు చేతికొచ్చేవరకు అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల సరఫరా విషయంలో కృత్రిమ కొరత సృష్టించే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా స్థాయిలో డిస్ట్రిక్ట్ ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీ సభ్యులను సమన్వయం చేసుకుంటూ గృహావసరాలకు వినియో గించే గ్యాస్ సరఫరాలో వినియోగదారులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాల న్నారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తగు చర్యలు తీసుకోవాలని, పంటల స్టోరేజ్ పాయింట్స్ గుర్తించి రైతులకు ఇబ్బంది లేకుండా – మిగతా4లో..



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

## జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్‌లపై నిఘా ఉంచండి

- ◆ సాయి కృప ఆసుపత్రి సీజ్...
- ◆ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి,మార్చి 13 ప్రభాత వార్త:** నాగర్‌కర్నూల్ జిల్లాలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిర్వహిస్తున్న స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా పెట్టాలని, ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా అక్రమ అబార్షన్లు నిర్వహించినట్లు తేలితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్‌లాల్, కమిటీ సభ్యులు ఐ.ఎం.ఏ డిస్టిక్ ప్రెసిడెంట్ డాక్టర్ చెన్నయ్య, డిఎంహెచ్ఓ డాక్టర్ రవినాయక్, అధికారులు పాల్గొన్నారు. కొల్లాపూర్ పట్టణంలో ఉన్న సాయికృప ప్రైవేట్ ఆస్పత్రిలో ఇటీవల ఒక బాలికకు అక్రమంగా అబార్షన్ నిర్వహించారనే ఆరోపణలపై కమిటీ చర్చించారు. ఈ నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆసుపత్రిని సందర్శించి సమర్పించిన నివేధికలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. జిల్లా కమిటీ నిర్ణయం మేరకు సాయికృప ఆసుపత్రిని సీజ్ చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. జిల్లాలో ఎక్కడైనా ప్రైవేట్ ఆస్పత్రుల్లో స్కానింగ్ సెంటర్ల ద్వారా లింగ నిర్ధారణ పరీక్షలు లేదా అక్రమ అబార్షన్లు నిర్వహించినట్లు గుర్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వోను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న 38 స్కానింగ్ సెంటర్లపై ప్రత్యేక నిఘా ఉంచి, ప్రైవేట్ ఆస్పత్రులపై తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ప్రైవేట్ ఆసుపత్రుల్లో రిజిస్ట్రేషన్‌లో పొందుపరిచిన నిబంధన మేరకు ఆసుపత్రులు కొనసాగుతున్నాయా లేదా అన్న అంశంపై వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణ జరపాలని కోరారు. స్కానింగ్ సెంటర్లపై పటిష్ట నిఘా పెట్టాలని, ఇబ్బందులు ఉంటే –మిగతా4లో..




జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్

## గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

**ఎర్రవల్లి మార్చి 13, (ప్రభాతవార్త):** ఎర్రవల్లి మండల పరిధిలోని బీచుపల్లి గురుకుల పాఠశాలలో శుక్రవారం ఆర్ బి ఎస్ కే బృందం మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇటిక్యాల ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఇందులో మొత్తం 537 మంది విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు జరిపారు. ముఖ్యంగా ఈ ఆర్ బి ఎస్ కె బృందంలో డాక్టర్ రాఘవేంద్ర , ఇంద్రజ, లక్ష్మి , అనిత ఏఎన్ఎంలు, శేఖర్, వెంకటేష్ సూపర్వైజర్లు, ప్రభాకర్, శ్రీనివాసులు హెల్త్ అసిస్టెంట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఇటిక్యాల తరఫున సిబ్బంది అందరూ కలిసి ఈ క్యాంపు నిర్వహించారు.ఇందులో ముఖ్యంగా డాక్టర్ దివ్య కంటి డాక్టర్, కీర్తి పిల్లల డాక్టర్, వృషాలి డెంటల్ డాక్టర్ వీరు స్పెషలిస్ట్ డాక్టర్లు అందరూ కలిసి ఈ కార్యక్రమమును ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ క్యాంపును నిర్వహించారు. ఇందులో ముఖ్యంగా పంటి నొప్పులు 35 విద్యార్థులకు మరియు కంటి పరీక్షలకు 27 మంది విద్యార్థులకు మిగతా ఆరోగ్య పరీక్షలకు 72 మంది విద్యార్థుల కు చికిత్సలు అందించి మందులను పంపిణీ చేశారు. వారికి రక్త పరీక్షలు కూడా చేశారు రక్తహీనత ఉన్నవారికి ఐరన్ మాత్రలు పంపిణీ చేశారు. విద్యార్థులకు ఎండాకాలం నుండి వచ్చే ఆరోగ్య సమస్యలు వడదెబ్బ మరియు వ్యక్తిగత పరిశుభ్రత గురించి వారికి ఆరోగ్య విద్య కూడా బోధించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు మిగతా టీచర్లు అందరూ సహకరించడం జరిగింది.

## విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్ల పంపిణీ



విద్యార్థులకు వాటర్ బాటిళ్లు అందజేస్తున్న దృశ్యం

**దామరగిద్ద, మార్చి 13 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని ముస్తాపేట్, దేశాయిపల్లి గ్రామాల ప్రాథమిక పాఠశాలల్లో బీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ రాజ్ కుమార్ రెడ్డి సహకారంతో విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని సుమారు 50 మంది విద్యార్థులకు ఆయా గ్రామాల సర్పంచులు లాలప్ప, నరసప్ప చేతుల మీదుగా బాటిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ఉచిత ఇంగ్లీష్ విద్య అందిస్తున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమానికి సహకరించిన రాజ్ కుమార్ రెడ్డికి గ్రామస్తులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మి, రవికిరణ్ చారి, మాజీ ఎంపీటీసీలు అంజిలయ్య గౌడ్, రోషలప్ప, మాజీ సర్పంచులు రంగయ్య గౌడ్, లాలప్ప, నాయకులు నరేందర్ గౌడ్, భీంసేన్ గౌడ్, బసప్ప, గోవిందు, సాయి, ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఎస్‌సి పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ విధింపు




పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్సై వెంకట్ రెడ్డి

**ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌సి (పదవ తరగతి) పరీక్షా కేంద్రం వద్ద శాంతిభద్రతల పరిరక్షణ కోసం 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటరెడ్డి తెలిపారు. పరీక్షల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా శనివారం నుంచి పరీక్షలు పూర్తయ్యే వరకు పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందని తహసిల్దార్ అద్దంకి సునీత, ఎస్సై వెంకట్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ పరీక్షల సమయంలో పరీక్షా కేంద్రం పరిసర ప్రాంతాల్లో గుంపులుగా నిలబడడం, అనవసరంగా తిరగడం, శబ్దం చేయడం వంటి చర్యలను పూర్తిగా నిషేధిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అలాగే మండల కేంద్రం లోని అన్ని జిరాక్స్ కేంద్రాలను పరీక్షల సమయంలో మూసివేయాలని సంబంధిత యజమా నులకు ఆదేశాలు జారీ చేసినట్లు వారు పేర్కొన్నారు. పరీక్షలకు అంతరాయం కలిగించే ప్రయత్నాలు చేసే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు.విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ , రెవెన్యూ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపడుతున్నట్లు తెలిపారు. దీంతో పరీక్షా కేంద్రం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం గా ఏర్పాటు చేశారు.

## ఆర్గానిక్ వ్యవసాయంపై రైతులకు శిక్షణ

### చర్యాల గ్రామాన్ని సందర్శించిన దామరగిద్ద మండల రైతులు




క్షేత్ర సందర్శనలో రైతులు

**దామరగిద్ద,మార్చి 13 ప్రభాతవార్త :** రైతుల క్షేత్ర సందర్శన కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండలానికి చెందిన రైతులు సిద్దిపేట జిల్లాలోని చర్యాల గ్రామా న్ని సందర్శించారు. ఈసందర్భంగా అక్కడ అమల వుతున్న ఆర్గానిక్ వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణలో భాగంగా రసాయన ఎరువులు, పురుగుమందులు లేకుండా పంటలను సాగు చేసేవిధానాలు,సహజ ఎరువుల తయారీ, జీవామృతం, ఘన జీవామృతం వినియోగం, మట్టి సారాన్ని పెంపొందించే పద్ధతులపై నిపుణులు రైతులకు వివరించారు. అలాగే ఆర్గానిక్ పద్ధతులతో పంటలు సాగు చేయడం వల్ల ఖర్చులు తగ్గడమే కాకుండా, పంటలకు మంచి ధర లభిస్తుందని నిపుణులు సూచించారు. రైతులు క్షేత్ర స్థాయిలో సాగు విధానాలను పరిశీలించి పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో దామరగిద్ద మండలానికి చెందిన పలువురు రైతులు పాల్గొని ఆర్గానిక్ వ్యవసాయంపై అవగాహన పెంపొందించుకున్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం : ఎంఈఓ మురళి కృష్ణ

**చిన్న చింతకుంట, మార్చి 13 ప్రభాతవార్త :** పదవ తరగతి పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పది పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు మండల విద్యాధికారి మురళి కృష్ణ తెలిపారు. మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. చిన్నచింతకుంట పరీక్ష కేంద్రంలో చిన్నచింతకుంట, ఉంద్యాల,కస్తూర్బా గాంధీ, బీసీ గురుకుల పాఠశాల, విక్టరీ కాన్సెప్ట్ స్కూల్‌లకు చెందిన 283 మంది విద్యార్థులకు గాను వీరిలో బాలురు 173, బాలికలు 110 మంది విద్యార్థులు, వడ్డేమాన్ పరీక్ష కేంద్రంలో వడ్డేమాన్, లాల్ కోట, బండర్ పల్లి, అప్పంపల్లి, ముచ్చింతల, గౌతమ్ మోడల్ స్కూల్ లకు చెందిన 254 లకు గాను బాలురు 142, బాలికలు 112 మంది విద్యార్థులు పరీక్షలు వ్రాయనున్నారు. చిన్నచింతకుంట పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ గా గంగయ్య, డిపార్ట్మెంటల్ అధికారిగా రమాదేవి, వడ్డేమాన్ పరీక్ష కేంద్రానికి చీఫ్ సూపరింటెండెంట్ గా సాయన్న, డిపార్ట్మెంట్ అధికారిగా అరుణ లను నియమించారు. నేటి నుంచి ఏప్రిల్ 13 వరకు పది పరీక్షలు కొనసాగుతాయి. ఉదయం 9:30 ని. నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్ష కొనసాగుతుందని ఆయన తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 100 మీటర్ల దూరం వరకు 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఆరోగ్య సిబ్బంది ,మంచినీటి వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులు పది పరీక్షలను ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా వ్రాయాలని ఆయన సూచించారు.

## లక్ష్మాపూర్‌లో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు

**ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త :** మండలంలోని లక్ష్మాపూర్ గ్రామంలో శుక్రవారం మండల పశువైద్య శాఖ అధికారి డా. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పాడి పశువుల గాలి కుంటు నివారణ టీకాలు గ్రామ సర్పంచ్ బీసం గోపాల్ చేతుల మీదుగా ప్రారంభించారు. పాడి రైతులు సకాలంలో పశువైద్య శిబిరానికి సకాలంలో వచ్చి పశువులకు టీకాలు వేయించుకోవాలని వైద్య అధికారి డా. ప్రవీణ్ కుమార్ సూచించారు. ఈ టీకా వేయించడం వల్ల పాల దిగుబడి తగ్గుతుందని, పశువులు బక్క పడతాయని అపోహలు నమ్మకూడదని పశువైద్యాధికారి వివరించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారి డా. ప్రవీణ్ కుమార్, సిబ్బంది శ్రీను,జెవిఓ, గోపాల మిత్రులు శ్రీను, అంజయ్య,ఓఎస్ మిరాజ్, హబీబ్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక



కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

**అడ్డాకుల, మార్చి 13 ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజా సమస్యలు పరిష్కారం చేసేందుకు ప్రజా పాలన ప్రగతి పాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం నాడు అడ్డాకుల మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన స్పెషల్ క్యాంపు వైద్య శిబిరాన్ని దేవరకద్ర శాసనసభ్యులు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం 30 లక్షల నిధులతో ఆహార ధాన్య నిల్వ కేంద్రం గోదాం నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి పాల్గొన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ పట్టాలను ఎమ్మెల్యే అందజేసారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గ ప్రజలకు కల్యాణ లక్ష్మి పథకం ఒక వరం లాంటిదని అన్నారు.సొంత గూడు లేని పేద ప్రజలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు లబ్ధి చేకూరుతాయని అని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారులు, అధికారులు, మండల నాయకులు,సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



మడ్డ మోని పంపు కాలనీ లో మురుగునీరు పారబోస్తున్న దృశ్యం

**ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త :** తమ ఇండ్ల మధ్య పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మురుగునీరు ఎప్పటికప్పుడు తోడేయాలని వైద్య అధికారిణి డా. స్వప్న సూచించారు. శుక్రవారం మండల కేంద్రమైన ఉప్పునుంతల మడ్డ మోని పంపు కాలనీలో స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వారు, గ్రామపంచాయతీ వారు సంయుక్తంగా ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీలో మురుగునీరు ఉన్న హౌస్ లను పరిశీలించి వారికి అవగాహన కల్పించారు. నీరు నిల్వ ఉండడంతో దోమల బెడద అధికంగా అవుతుంది అని, దోమ కాటుకు పలు రకాల విషపు జ్వరాలు వచ్చే అవకాశాలు అధికంగా ఉంటాయని వైద్య అధికారిణి సూచించారు.అదే విధంగా ఇండ్లల్లో ఉన్న కుటుంబ సభ్యులు తమ పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని కల్పించారు. శుక్రవవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కాలనీవాసులకు అవగాహన కల్పిస్తూ వేసవికాలంలో అధికంగా దోమ బెడద పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఎండ తీవ్రత పెరిగే కొద్దీ జాగ్రత్తలు తీసుకోవాలని పలు సూచనలు ,సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు చింతగాళ్ళ శ్రీనివాసులు,వైద్య అధికారిణి డా.స్వప్న, సూపర్‌వైజర్ ప్రభావతి, ఫార్మసిస్టు కుమార చారి,ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్య గౌడ్, వార్డు సభ్యులు వీరాస్వామి, రేణయ్య, కుందేటి లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేష్, శ్రీఉమామహేశ్వర దేవస్థాన కమిటీ డైరెక్టర్ బొల్లె లక్ష్మయ్య, వైద్య సిబ్బంది దేవి, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు,పంచాయతీ సిబ్బంది ఆలూరి రమేష్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బాలానగర్ పోలీస్ స్టేషన్‌లో డ్రైవర్లకు ఉచిత కంటి వైద్య శిబిరం



ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

**బాలానగర్, మార్చి 13 ప్రభాతవార్త :** బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం జిల్లా ఎస్పీ డి.జానకి ఆదేశాల మేరకు ప్రజాపాలన ప్రగతి నివేదిక ప్రణాళికలో భాగంగా రాష్ట్ర డీజీపీ తలపెట్టిన అరైవ్ అలైవ్ నినాదం ప్రేరణతో ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు, జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే భారీ వాహనాల డ్రైవర్ల కోసం ఉచిత కంటి, ఈ.సి.జీ పరీక్షల వైద్య శిబిరాన్ని విజయ కార్డియాక్ హాస్పిటల్, భవాని ఐ కేర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అదనపు ఎస్పీ ఎన్.బి.రత్నం హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్‌కు కంటిచూపు స్పష్టంగా ఉండటం అత్యంత ముఖ్యమని, డ్రైవింగ్ సమయంలో ఎదురుగా, పక్కన, వెనుక నుంచి వచ్చే వాహనాలను నిరంతరం గమనిస్తూ అప్రమత్తంగా ఉండాల్సి ఉంటుందని తెలిపారు. డిఫెన్స్ డ్రైవింగ్‌లో కంటిచూపు కీలక పాత్ర పోషిస్తుందని, కంటిచూపు మెరుగ్గా ఉంటే ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారించగలుగుతారని పేర్కొన్నారు. అదేవిధంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ధరించడం, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, అలాగే సరైన లైన్ డ్రైవింగ్ పాటించడం వంటి అంశాలపై డ్రైవర్లకు పిపిటి ప్రదర్శన ద్వారా వివరించారు. డ్రైవింగ్ నైపుణ్యాలు మరియు రోడ్డు భద్రత నియమాలపై కూడా వారికి అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో బాలనగర్ ప్రాంతానికి చెందిన ఆటో డ్రైవర్లు, క్యాబ్ డ్రైవర్లు జాతీయ రహదారి మీదుగా ప్రయాణించే ఇతర భారీ వాహనాల డ్రైవర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని కంటి పరీక్షలు, నిదిబి చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జున గౌడ్, ఎస్సై లెనిన్, విజయ కార్డియాక్ హాస్పిటల్ డాక్టర్ చందులాల్ రాథోడ్, భవాని ఐ కేర్ డాక్టర్ రెడ్యా నాయక్, హాస్పిటల్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో స్వపరిపాలన వేడుకలు



స్వపరిపాలన దినోత్సవం నిర్వహించిన ఠాగూర్ మెమోరియల్ స్కూల్ విద్యార్థిని,విద్యార్థులు

**భూత్పూర్,మార్చి 13,ప్రభాతవార్త:** భూత్పూర్ పట్టణంలోని బీసీ కాలనీలో ఉన్న ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో శుక్రవారం విద్యార్థిని,విద్యార్థులు స్వపరిపాలన దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులై పాఠాలు భోధిస్తూ పలువురిని ఆకట్టుకున్నారు. డీఈఓ,ఎంఈఓ,కరస్పాండెంట్,ప్రిన్సి పాల్/హెచ్‌ఎంలుగా ఆయా పాత్రల్లో విద్యార్థులు రాణించారు. డీఈఓగా గొడుగు సంజీవ,ఎంఈఓగా చీపుర్ల కార్తీక,కరస్పాండెం ట్‌గావడ్డెవాట్ సింధు,ప్రిన్సిపాల్/హెచ్‌ఎంగా చీపుర్ల హర్షిక అద్భుతంగా అభినయించి అందరి మెప్పును పొందారు.మిగిలిన ఉపా ధ్యాయులుగా గొడుగు రిషిత,గడ్డమీది మహేష్,సుంకరి అచ్యుత్, భరత్,బోయవిష్ణులు అద్భుతంగా తమపాత్రలకు న్యాయం చేశా రు.పీఈటీలుగా చీపుర్ల ప్రణీత్,భరత్,సన్ని విధులు నిర్వర్తించారు. అటెండర్‌గా కాట్రావత్ జయరాం,స్వీపర్‌గా కాట్రావత్ గౌతమ్ తమ పాత్రలకు న్యాయం చేశారు. టీచింగ్.నాన్ టీచింగ్‌స్టాఫ్ ను,పర్యవేక్షణాధికారులుగా నటించి పాత్రలకు న్యాయం చేసిన విద్యార్థిని,విద్యార్థులను పాఠశాల కరస్పాండెంట్ గొడుగు వెంకటయ్య,ప్రిన్సిపాల్ కాడ్లూర్ చాముండేశ్వరి అభినందించి వారికి ప్రోత్సాహకాలను అందించారు.ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపా ధ్యాయురాళ్లు సన,సృష్టి,మాధవి, పుష్ప,రాణి తదితరులు పాల్గొన్నారు.

## పది పరీక్షలకు కట్టుదిట్టమైన పోలీసు భద్రత

**పరీక్షా కేంద్రాల వద్ద బిఎన్ఎస్ఎస్ 163 (144 సెక్షన్) అమలు...**

**జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఎస్పీ ఆదేశాలు**

**37 కేంద్రాల్లో 7,212 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు**



జిల్లా ఎస్పీ సునీత రెడ్డి (ఫైల్)

**వనపర్తి,మార్చి 13 ప్రభాతవార్త :** విద్యార్థులు ఎటువంటి భయం లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లాలోని అన్ని పదవ తరగతి (ఎస్ఎస్‌సి) పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ సునిత రెడ్డి తెలిపారు. వనపర్తి జిల్లాలో నిర్వహించనున్న పదవ తరగతి (ఎస్‌సిసి) వార్షిక పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద శాంతిభద్రతలు పరిరక్షించేందుకు బిఎన్ఎస్ఎస్-2023 సెక్షన్ 163 (144 సెక్షన్) అమలు చేస్తున్నట్లు వెల్లడించారు.వనపర్తి జిల్లాలో 37 పరీక్షా కేంద్రాలలో మొత్తం 7,212 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 200 మీటర్ల పరిధిలో ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం. ఈ ఆంక్షలు 14 మార్చి 2026 నుండి 16 ఏప్రిల్ 2026 వరకు అమల్లో ఉంటాయి. ప్రతి పరీక్షా రోజు ఉదయం 07:00 గంటల నుండి మధ్యాహ్నం 03:00 గంటల వరకు సెక్షన్ 163 అమల్లో ఉంటుందని తెలిపారు.పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లో ఉన్న జిరాక్స్ సెంటర్లు పరీక్షల సమయంలో తప్పనిసరిగా మూసివేయాలని ఎస్పీ ఆదేశించారు. జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ అధికారులకు పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ వాచీలు లేదా ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్షా కేంద్రాల్లోకి తీసుకురావద్దని సూచించారు. పరీక్షల సమయంలో ఇన్విజిలేటర్లు పోలీస్ సిబ్బంది మొబైల్ ఫోన్ల వినియోగాన్ని కూడా నిషేధించారు. ఈ ఉత్తర్వులను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ హెచ్చరించారు. విద్యార్థులు ఎటువంటి ఆందోళన లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా జిల్లా పోలీస్ శాఖ సంపూర్ణ భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్షల పారదర్శకతను కాపాడేందుకు ప్రజలు, తల్లిదండ్రులు పోలీసు శాఖకు సహకరించాలని జిల్లా ఎస్పీ కోరారు.

## భీమేష్ కుటుంబానికి అండగా ఉంటాం

### బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థికసాయం



భీమేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, మార్చి 13 ప్రభాతవార్త:** ఇటీవల ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందిన జడ్చర్ల మున్సిపాలిటీ నాగసాల 5వ వార్డ్ కి చెందిన భీమేష్ కుటుంబాన్ని శుక్రవారం జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్‌రెడ్డి భీమేష్ మృతిపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేస్తూ కుటుంబ సభ్యులను ఓదార్చారు.ఇలాంటి దుర్ఘటన వారి కుటుంబానికి తీరనిలోటని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ఎల్లప్పుడూ తన సహాయం ఉంటుందని భరోసా ఇచ్చారు.అనంతరం మృతుడి కుటుంబానికి తక్షణ సహాయంగా రూ.50,000 ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## 16న జిల్లా జూనియర్ బాస్కెట్ బాల్ బాలబాలికల జట్లకు ఎంపికలు

**మహబూబ్‌నగర్, మార్చి 13 ప్రభాతవార్త :** మహబూబ్ నగర్ జిల్లా బాస్కెట్ బాల్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన ఉదయం 9.00గంటలకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో మహబూబ్ నగర్ జిల్లా జూనియర్ బాస్కెట్ బాల్ బాల బాలికల జట్లకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మహబూబ్ నగర్ జిల్లా బాస్కెట్ బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మక్సూద్ బిన్ అహమ్మద్ జాకీర్ అడ్వకేట్, మహమ్మద్ నస్రుల్లా హైదర్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ ఎంపికలకు 01.01.2008 తర్వాత జన్మించిన బాలబాలికలు అర్హులని పేర్కొన్నారు. ఎంపికలకు హాజరై క్రీడాకారులు ఆధార్ కార్డు తో నివేదించాలని సూచించారు. క్రీడా నైపుణ్యాలతో ఉన్న క్రీడాకారులకు ఎంపిక చేసి రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ బాల బాలికల ఛాంపియన్షిప్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 8897985455 నెంబర్ ను సంప్రదించాలని కోరారు.

## సాహితీ స్కూల్‌లో సెల్ఫ్ గవర్నమెంట్ డే

**భూత్పూర్,మార్చి 13,ప్రభాతవార్త :** భూత్పూర్ పట్టణ కేంద్రంలోని సాహితీ హైస్కూల్‌లో శుక్రవారం స్కూల్ విద్యార్థిని, విద్యార్థులు సెల్ఫ్ గవర్నమెంట్ డేను ఘనంగా నిర్వహించారు. డీఈఓగా ఇందుశ్రీ,ఎంఈఓగా దీక్షిత,ప్రిన్సిపాల్‌గా హరిచరణ నాయక్ చాలాచక్కగా తమపాత్రలకు న్యాయం చేశారు. ఉపాధ్యాయులుగా నాను,ప్రియ,అమలు,జువేరియాలు,రిదా, అవేజ్, సంతోష్‌లు,పీఈటీగా గౌతం అద్భుతంగా అభినయించారు.విద్యార్థులు ఉపాధ్యాయులుగా చక్కగా అభినయించినందున పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సత్యనారాయణతో పాటు ఉపాధ్యాయ బృందం మెమెంటోలు అందజేశారు.

## ఛాత్రోపాధ్యాయులుగా విద్యార్థులు



ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులు

**ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త :** మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల లక్ష్మాపూర్ లో శుక్రవారం విద్యార్థులు చాత్రోపాధ్యాయులుగా వ్యవహరించి ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రధానోపాధ్యాయులుగా సరిత, మండల విద్యాధికారిగా దుర్గా మరో 13 మంది విద్యార్థులు చాత్రోపాధ్యాయులుగా వ్యవహరించారు. అనంతరం చాత్రోపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను పరిశీలించిన న్యాయ నిర్ణేతలు ఎంపిక చేసిన ఉత్తమ ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించిన విద్యార్థులను ఎంపిక చేసి వారికి బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆ పాఠశాల హెచ్ఎం వెంకటయ్య, లక్ష్మణ్, బుచ్చయ్య, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## శుభ్రత కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్

**దేవరకద్ర, మార్చి 13 ప్రభాతవార్త :** కౌకుంట్ల మండలాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు గ్రామ సర్పంచ్ నరేష్ కుమార్ ఆధ్వర్యంలో గ్రామ శుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రధాన వీధులు కాలనీలు డ్రైనేజీలు శుభ్రం చేయించి చెత్తను తొలగించారు. గ్రామ ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొని పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సర్పంచ్ సూచించారు. అదేవిధంగా ప్రతి ఇంటి ముందు చెత్త వేయకుండా తడి,పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామం పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం కూడా మంచిగా ఉంటుందని సర్పంచ్ నరేష్ కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## వెల్టూర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**ఉప్పునుంతల, మార్చి 13 ప్రభాతవార్త :** మండలంలోని వెల్టూరు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ గున్నమెని లింగమయ్య యాదవ్ కూతురు పెళ్లి నిశ్చితార్థం శుక్రవారం శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిలోని శ్రీ వేంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారి నీ ఆశీర్వదించారు. టిపిసిసి ఉపాధ్యక్షుడు, నాగర్ కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ తో పాటు మండల నాయకులు తిప్పర్తి నరసింహారెడ్డి, అనంతరెడ్డి, అచ్చంపేట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆడుపాల గోపాల్ రెడ్డి, సీనియర్ న్యాయవాది మాజీ సర్పంచ్ కర్నె లక్ష్మీనారాయణ, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెన్న శ్రీనివాసులు,సూరం ప్రశాంత్ రెడ్డి ( బిట్టు) స్థానిక నాయకులు రాగి వేణుగోపాల్ రెడ్డి, రంగారావు, గోవు సింగోటం, జైపాల్ రెడ్డి అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# జిల్లాలో ఎల్‌పిజి సిలిండర్లకు ఎలాంటి కొరత లేదు

- ప్రజలు ఆందోళన చెందవద్దు
- అవసరానికి మించి అడ్వాన్సుగా బుకింగ్ చేసుకోవద్దు
- జిల్లాలో గృహావసరాలకు, విద్యాలయాలకు, ఆసుపత్రులకు సిలిండర్ కొరత రాకుండా చూసుకోండి
- గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లను ఆదేశించిన జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న జిల్లా అధికారులు

**వనపర్తి, మార్చి13 ప్రభాతవార్త:** జిల్లాల్లో గృహావసరాలకు ఎల్.పి.జి సిలిండర్లకు ఎలాంటి కొరత లేదనీ, హోటళ్లకు, ఇండస్ట్రీలకు కొంత ఇబ్బంది ఉంది తప్ప గ్రహవసరాలకు ఎలాంటి కొరత లేదు కాబట్టి ప్రజలు అనవసరంగా ఆందోళన చెంది అవసరానికి మించి అడ్వాన్సుగా బుకింగ్ చేసుకోవద్దనీ జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభిసూచించారు. శుక్రవారం సాయంత్రం ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎల్పిజి గ్యాస్ సరఫరా పర్యవేక్షణ కమిటీ సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ ఆయా గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ల వద్ద ప్రస్తుతం ఉన్న సిలిండర్ల నిల్వలు, ఇప్పటి వరకు వచ్చిన బుకింగ్ లు , ఏజెన్సీల నుండి రోజుకు వచ్చే సిలిండర్ల వివరాలను డిస్ట్రిబ్యూటర్లతో అడిగి తెలుసుకున్నారు. డిస్ట్రిబ్యూటర్లు వారి వద్ద ఉన్న సిలిండర్ల వివరాలు వెల్లడిస్తూ గృహావసరాలకు వాడే 14.5 కేజిల సిలిండర్లు ఎప్పటిలాగానే మాకు సప్లై అవుతున్నాయని, కేవలం 19 కెజి ల వాణిజ్య సిలిండర్లు తప్ప గృహావరాలకు ఎలాంటి సమస్య లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కలెక్టర్ ప్రజలు అనవసరంగా ప్యానిక్ అవుతున్నారని, ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. రానున్న రోజుల్లో సైతం గృహావసరాలకు గానీ విద్యాలయాలు, వసతి గృహాలు, కేజీబివిలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సిలిండర్లసమస్య రాకుండా చూసుకోవాలని డిస్ట్రిబ్యూటర్లను ఆదేశించారు. డిమాండు ను బట్టి ఎప్పటికప్పుడు సిలిండర్లు ఆర్డర్ పెట్టి తెప్పించుకోవాలని, ఏమైనా ఇబ్బందులు వస్తె తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. జిల్లా సివిల్ సప్లై అధికారికాశి విశ్వనాథ్, జిల్లా కమిటీ సభ్యులు డిఈఓ అబ్దుల్ ఘని, వ్యవసాయ అధికారి ఆంజనేయులు, పోలీస్ శాఖ తరపున సిఐ, సంక్షేమ శాఖల అధికారులు, జిల్లాలోని అందరూ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొన్నారు.

## నర్సింగాపూర్‌లో ఘనంగా వార్షికోత్సవ వేడుకలు



వార్షికోత్సవంలో చిన్నారులను అభినందిస్తున్న నాయకులు, అధికారులు, విద్యార్థులు

**భూత్పూర్, మార్చి 13, ప్రభాతవార్త:** భూత్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని రెండోవార్డు నర్సింగాపూర్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మండల విద్యాధికారిణి ఉషారాణి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, రెండో వార్డు కౌన్సిలర్ నిమ్మల అన్నపూర్ణ, ఐదో వార్డు కౌన్సిలర్ కెండ్యాల పద్మలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ ఉషారాణి మాట్లాడుతూ వార్షికోత్సవంలో చిన్నారులు ప్రదర్శించిన ప్రదర్శన అద్భుతంగా ఉందన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు, పాటలు, వ్యాయామం వారి వ్యక్తిత్వ వికాసానికి దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో భూత్పూర్ జెడ్పీహెచ్‌ఎస్ స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆనందమ్మ, స్కూల్ హెచ్‌ఎం శశిధర్‌గౌడ్‌తో పాటు ఇతర ఉపాధ్యాయులు సురేష్‌రెడ్డి, చంచల రవి, సత్తూర్ లింగం గౌడ్, సీఆర్పీలు ఠాగూర్, నాగేంద్రం, అంగన్వాడీ టీచర్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

## ఆలయ చైర్మన్ ఖరారయినట్టేనా..?



శ్రీకురుమూర్తి స్వామి దేవస్థానం

**చిన్న చింతకుంట, మార్చి 13 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని గ్రేడ్ వన్ దేవాలయాలలో ఒక్కటైన శ్రీకురుమూర్తి స్వామి దేవాలయ పాలక మండలి చైర్మన్ ఎంపిక ఖరారయినట్లుగా తెలుస్తుంది. రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఫిబ్రవరి 26న నూతన పాలక మండలి ఏర్పాటుకై నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ స్థానిక తహసిల్దార్‌కార్యాలయంలో నోటీసు బోర్డుపై ఉంచారు. ఆలయ ట్రస్ట్ సభ్యులుగా హిందూ సంస్కృతి సంప్రదాయాలు పాటిస్తున్న వారిని ఎంపిక చేస్తారు. నూతన పాలకవర్గానికి గాను నోటిఫికేషన్ జారీ చేసిన ఇప్పటివరకు కమిటీ సభ్యులను ఎంపిక ప్రక్రియ చేపట్టలేదని దేవస్థాన అధికారులు తెలిపారు. దేవస్థాన చైర్మన్‌గా ఈసారి బీసీలకు అవకాశం కల్పించవచ్చని తెలుస్తుంది. స్థానిక ఎమ్మెల్యే జిఎంఆర్ మండల కేంద్రానికి చెందిన బీసీనాయకుడిని ఖరారు చేసినట్లుగా తెలిసింది. ఈయన స్వర్ణ సుధాకర్ రెడ్డి ముఖ్య అనుచరుడు కావడం విశేషం. పూర్తిస్థాయి పాలక మండలి సభ్యుల ఎంపిక త్వరలో ఖరారు చేయనున్నట్లు తెలిసింది.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేత





పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసిన దృశ్యం

**మక్తల్ టౌన్, మార్చి13 ప్రభాతవార్త:** పట్టణంలోని శాంతి నికేతన్ గ్రామర్ హై స్కూల్ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు పరీక్ష ప్యాడ్స్, పెన్నులు పంపిణీ కార్యక్రమం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్ ఆల్కారి పావని ముఖ్య అతిథిగా విచ్చేసి వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు గాబర పడకుండా తడబడకుండా మీరు సంవత్సరం పాటు చదివిన పుస్తకాల నుంచి వచ్చే ప్రశ్నలు ఉంటాయి. కాబట్టి మీరు భయపడకుండా తడపడకుండగా వచ్చేటటువంటి ప్రశ్నలకు ధీటుగా సమాధానాలు ఇచ్చి మంచి మార్కులతో అందరూ కూడా ఉత్తీర్ణులు కావాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు రవికుమార్, మాజీ ఎంపిటిసి లక్ష్మణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ సలాం బిన్ ఉమర్, అంజయ్య ఆచారి, పాఠశాల కరస్పాండెంట్ రోహిణి , సీనియర్ ఉపాధ్యాయులు బ్రహ్మానందం , పాఠశాల ఉపాధ్యాయ బృందం పిఇటి అమ్రేష్, ఇందిరా, వెంకటేష్ , విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



ఉప్పునుంతల మైల్ స్టోన్ స్కూల్‌లో చాత్రోపాధ్యాయులుగా పని చేసిన విద్యార్థులు

**ఉప్పునుంతల, మార్చి 13ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల మైల్ స్టోన్ స్కూల్ లో శుక్రవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం జరుపుకున్నారు. ప్రిన్సిపాల్ గా జి. అరవిందు, వైస్ ప్రిన్సిపాల్ గా అక్షయ్ కుమార్, జిల్లా కలెక్టర్ గా శివ సాయి, డిప్యూటీ కలెక్టర్ గా పి. లోకేష్, జిల్లా విద్యాధికారిగా స్వాతిక్, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి గా డి. హరీష్, మండల విద్యాశాఖాధికారిగా అజయ్‌తో పాటు50 విద్యార్థులు ఛాత్రోపాధ్యాయులుగా వ్యవహరించారు. ఒకరోజు విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పలువురిని ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమం లో మైల్ స్టోన్‌స్కూల్ ప్రిన్సిపాల్ ఉన్నికృష్ణన్, పోనగంటి దేవేందర్‌రెడ్డి, బృంగి ఏడుకొండలు, నీరంజన్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్ అందజేత

**నారాయణపేట, మార్చి 13 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లా బిజ్వార్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి పరీక్షలు రాయబోతున్న 64 మంది విద్యార్థులకు పరీక్ష కిట్లను కొత్తపల్లి గ్రామ సర్పంచ్ ఆర్. నర్సింహులు అందజేశారు. పరీక్ష కిట్‌లో పెన్నులు, స్కేలు, పెన్సిల్, హాల్ టికెట్ కవర్లు ఉన్నాయి. అదే విధంగా కొత్తపల్లి గ్రామం నుండి పులిమామిడి సెంటర్‌కు పరీక్షలు రాయడానికి వెళ్లే విద్యార్థులకు ఆటో సౌకర్యం కల్పిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నర్సింహులు మాట్లాడుతూ విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాల, గురువులు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్. కిషోర్ కుమార్, ఉపాధ్యాయులు మహేష్, రమేష్, గోపాల్, నాగరాజు, గజలప్ప, హర్షద్, మనోహర్, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## నేటి నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు



ఇన్విజిలెటర్లతో మాట్లాడుతున్న పరీక్షల ముఖ్య నిర్వహణాధికారి ఎండి రజాక్



పరీక్షల కోసం ఏర్పాట్లు చేసిన గదులను పర్యవేక్షిస్తున్న అధికారులు

**ఉప్పునుంతల, మార్చి13 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వార్షిక పరీక్షలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 14 నుంచి ప్రారంభమయ్యే ఈ పరీక్షలు ఏప్రిల్ 13 వరకు కొనసాగనున్నాయి. పరీక్షల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ ఏడాది మండలం నుంచి మొత్తం 151 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. అందులో స్థానిక కస్తూర్బా విద్యాలయం నుంచి 42మంది విద్యార్థినులు, ఉన్నత పాఠశాల కాంసానిపల్లి నుంచి 24 మంది, పెనిమిళ్ళ హైస్కూల్ నుంచి 15 మంది, వెల్టూర్ ఉన్నత పాఠశాల నుంచి నుంచి 16 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. అదేవిధంగా మండల కేంద్రంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తెలుగు మీడియంలో 28 మంది, ఇంగ్లీష్ మీడియంలో 26 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యారు. మొత్తం 71 మంది విద్యార్థినులు, 80 మంది విద్యార్థులు ఈ వార్షిక పరీక్షలకు హాజరవుతుండటంతో పరీక్షా కేంద్రంలో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. శుక్రవారం పరీక్షల ముఖ్య నిర్వహణ అధికారి రజాక్, డిపార్ట్మెంటల్ ఆఫీసర్ ఎండి జాఫర్ పరీక్షా కేంద్రాన్ని సందర్శించి అక్కడి వసతులను పరిశీలించారు. విద్యార్థులకు అందుబాటులో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యాలు, కూర్చునే ఏర్పాట్లు వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పరీక్షా కేంద్రానికి కేటాయించిన ఇన్విజిలేటర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పరీక్షల సమయంలో పాటించాల్సిన నియమాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వారికి సూచనలు ఇచ్చారు. పరీక్షలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూసహకరించాలని అధికారులు కోరారు. అన్ని ఏర్పాట్లు పూర్తి కావడంతో పదవ తరగతి వార్షిక పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధం చేశారు.

## ఖాళీ సిలిండర్, కట్టెల పొయ్యి వంటతో సిపిఐ వినూత్న నిరసన





అంబేద్కర్ చౌక్‌లో నిరసన తెలుపుతున్న సిపిఐ నాయకులు

**వనపర్తి, మార్చి 13 ప్రభాతవార్త :** దేశంలో గ్యాస్ ధర పెంచటాన్ని నిరసిస్తూ శుక్రవారం వనపర్తి అంబేద్కర్ చౌక్ లో సిపిఐ వనపర్తి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో ఖాళీ సిలిండర్ కు దండ వేసి, కట్టెల పొయ్యి పై వంట చేసి వినూత్న నిరసన తెలిపారు. మోడీ పాలనకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అమెరికా ఇజ్రాయిల్‌ఇరాన్ మధ్య యుద్ధం పేరుతో వంటగ్యాస్ సిలిండర్ ధరను రూ. 60, వాణిజ్య సిలిండర్ ధరను రూ. 115 కు పెంచటం బిజెపి నరేంద్ర మోడీ పాలనా వైఫల్యానికి నిదర్శనమని సిపిఐ వనపర్తి నియోజకవర్గ కార్యదర్శి రమేష్, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా గౌరవ అధ్యక్షురాలు కళావతమ్మ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎన్ ఎఫ్ఐడబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ విమర్శించారు. ట్రంపు తనకు దోస్తునని గొప్పలు చెబుతున్న నరేంద్ర మోడీ ఎందుకు యుద్ధాన్ని నివారించడం లేదని, గ్యాస్ ధరలను ఎందుకు సామాన్యులు మోయలేనంతగా పెంచుతున్నారని విమర్శించారు. గ్యాస్ దొరికే పరిస్థితి లేక హోటల్లు గ్యాస్ తో చేస్తే ఉత్పత్తులన్నీ ఆగిపోయి దేశం అస్తవ్యస్తంగా మారిందన్నారు. దేశంలో ఎక్కడ గ్యాస్ దొరకకపోయినా కొరతలేదని బుకాయిస్తున్న అబద్దాల నరేంద్ర మోడీకి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. యుద్ధం నేపథ్యంలో గ్యాస్ను తగినంత నిలువ చేసుకోలేని అసమర్థుడైన మోడీ గద్దె దిగాలని డిమాండ్ చేశారు. పెరిగే ధరలకు హద్దే లేదు... ఏలేవానికి బుద్దే లేదు... పెరిగిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలి అంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ధరల పెరుగుదలపై రికార్డు చేసి వినిపించిన పాటలు ప్రజలను ఆకర్షించాయి. ఎన్ఎఫ్ఐ డబ్ల్యు జిల్లా గౌరవ అధ్యక్షురాలు, మాజీ కార్యదర్శి కళావతమ్మ, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎన్ఎఫ్ఐ డబ్ల్యు పట్టణ కన్వీనర్ జయమ్మ తదితరులు మాట్లాడగా, తెల్ల రాళ్లపల్లి మాజీ ఉప సర్పంచ్ కాకం బాలస్వామి, చిన్న కురుమన్న, ఎర్రకురుమన్న, పృథ్వీ నాదం, రమణ, వంశీ, వెంకటమ్మ, జ్యోతి, సుప్రియ, ఖాసీం బీ, ఖాజా, అలివేల, మైనూస్ తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు



వల్లూరులో మాజీ ఎంపీటీసీ రవి నాయక్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు



మాజీ వైస్ ఎంపీపీ తుమ్మల సుజాత శేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న ముస్లిం సోదరులు

**జడ్చర్ల, మార్చి 13 ప్రభాతవార్త :** జడ్చర్ల మండల పరిధిలోని వల్లూరు గ్రామంలో ముస్లిమ్ సోదరులకు మాజీ ఎంపిటీసీ రవి నాయక్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇఫ్తార్‌విందు ఏర్పాటు చేశారు. హిందూ ముస్లిమ్ ఐకమత్యంతో మెలగాలని, హిందూ ముస్లిమ్ బాయి బాయి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, డిప్యూటీ సర్పంచ్ పి. వెంకటేష్, వార్డ్ మెంబెర్‌లు రాజు, రూపుసింగ్, శంకర్, బి. యాళ్లప్పా, రఘు, ఈ శేఖర్, మజీద్, ఇమాం జహంగీర్, గౌరవ అధ్యక్షుడు రషీద్, అధ్యక్షుడు ఇంతియాజ్, పెద్దలు అహ్మద్, బాబుజాని, మహమూద్, నల్లాల పాషా, సలాం, గౌస్, ఖాజపాష నవాబ్, చాన్ పాషా, నిరంజన్, ఖాదర్, జబీ, ఖలీల్, సోహేల్ అర్మాన్, షఫీ ఫయాజ్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

**దేవరకద్ర, మార్చి 13 ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని కౌకుంట్ల మండల కేంద్రంలోని జామియా మసీదులో ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు మాజీ వైస్ ఎంపీపీ తుమ్మల సుజాత శేఖర్‌రెడ్డి ఏర్పాటు చేశారు. ఉపవాసం ముగించుకునే సమయంలో ముస్లింలతో కలిసి, ఇఫ్తార్‌లో పాల్గొని సోదరాభావాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా అన్నీ మతాల ప్రజలు ఐక్యతతో పండుగలను జరుపుకోవాలని వారు అన్నారు. అనంతరం ముస్లిం సోదరులు మాజీ వైస్ ఎంపీపీ తుమ్మల సుజాత శేఖర్‌రెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శివకుమార్, ముస్లిం సోదరులు షబ్బీర్ అలీ, ఫజల్ రెహమాన్, నంద్యాల ఖాదర్, రహమాన్, ఎండి నజీర్, సలాం పాషా, బాబూజాని పాల్గొన్నారు.

**దామరగిద్ద, మార్చి 13 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని తయ్యాబా మస్జిద్, జామ మస్జీద్‌లలో ఇఫ్తార్ విందు కార్య క్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కానుకుర్తి గ్రామ సర్పంచ్ నారనోళ్ల నారాయణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భం గా సర్పంచ్ నారనోళ్ల నారాయణతో పాటు మాజీ ఎంపిటిసి, మాజీ ఉపసర్పంచ్, గ్రామ నాయకులు, మైనారిటీ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.



## రైతులకు వ్యవసాయ యంత్రాల పంపిణీ



**నారాయణ పేట, మార్చి 13 ప్రభాతవార్త:** నారాయణపేట పట్టణం లోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏఎంసీ ప్రాంగణంలో రైతులకు వ్యవసాయ యంత్రాల పంపిణీ కార్యక్రమం ఘనంగానిర్వహించారు. ఎమ్మెల్యే చిట్టెం పర్ణికరెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు కుంభం శివకుమార్ రెడ్డి సహకారంతో, ఏఎంసి చైర్మన్ రాంపురం శివారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కొల్లంపల్లి గ్రామ రైతులకు రెండు పవర్ టిల్లర్లు, అప్పిరెడ్డిపల్లి గ్రామ రైతుకు ఒక రోటావేటర్ పంపిణీ చేశారు. ఈసందర్భంగా చైర్మన్ శివారెడ్డి మాట్లాడుతూ ఆధు నిక వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలనుఅందిస్తున్నదని తెలిపారు. ఈ యంత్రాల వినియోగంతో రైతులు తక్కువ ఖర్చుతో, తక్కువ సమ యంలో వ్యవసాయ పనులు పూర్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్లు శరణప్ప, జనార్ధన్ గౌడ్, వ్యవసాయ అధికారి దినాకర్, గ్రామ వ్యవసాయ విస్తరణ అధికారులు ఏఈఓ లు మార్కెట్ ట్రేడర్లు, స్థానిక నాయకులు, వ్యవసాయశాఖ అధికారులు, మార్కెట్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. పంపిణీ చేసిన యంత్రాలు రైతులకు వ్యవసాయ పనుల్లో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని వారు తెలిపారు.

## విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ

**దేవరకద్ర, మార్చి 13 ప్రభాతవార్త:** దేవరకద్ర మండల పరిధిలోని వెంకటాయపల్లి గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. విద్యార్థులు ఉపాధ్యాయ పాత్ర నిర్వహించి, తరగతి గదిలో విద్యార్థులకు చక్కగా పాఠ్యాన్ని బోధించారు. విద్యార్థులు ఉపాధ్యాయులు గా శిరీష, రాణి, శివరాణి, కావ్య, హర్షవర్ధన్ , మనోహర్, మల్లికా, గణేష్, రాకేష్, తులసి, వికాస్, ఉపాధ్యాయ పాత్రలు నిర్వహించారు. చక్కగా పాఠలు బోధించిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఉమాదేవి, ఉపాధ్యాయులు సత్యనారాయణ, అంజాద్ అలీ, శేఖర్ , రాఘవేంద్ కుమార్, కురుమూర్తి, అజయ్ దేవగల్ల, విద్యార్థులు పాల్గొన్నారు.



స్వపరిపాలన దినోత్సవంలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

## నేడు గద్వాలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



**గద్వాల మార్చి 13, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తనయుడు సాయి సాకేత్ రెడ్డి వివాహ వేడుకలకు రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి గద్వాలకు రానున్నారు. బండ్ల సాయి సాకేత్ రెడ్డి, ఐశ్వర్యల వివాహ వేడుకలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు మధ్యాహ్నం 12 గంటలకు గద్వాలకు చేరుకుని నూతన వధూవరులను ఆశీర్వదించనున్నారు. ముఖ్యమంత్రితో పాటు డిప్యూటీ సీఎంమల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క ఈ వేడుకకు విచ్చేస్తున్నట్లు సమాచారం. ముఖ్యమంత్రి, మంత్రుల పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ఇప్పటికే పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

## పానుగల్ ఎస్సైగా సి.కురుమయ్య



ఎస్పీకి పుష్పగుచం అందజేస్తున్న పాన్‌గల్ ఎస్సై

**వనపర్తి, మార్చి13 ప్రభాతవార్త :** పోలీసు శాఖలో క్రమశిక్షణ, ప్రజా భద్రత, చట్టపరమైన నిబద్ధతలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తూ విధులు నిర్వహించాలని వనపర్తి జిల్లా ఎస్పీ సునితరెడ్డి, నూతన ఎస్సైకి స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పానుగల్ నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన సి. కురుమయ్య శుక్రవారం వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ సునిత రెడ్డిని మర్యాద పూర్వ కంగా కలిసి పుష్పగుచ్చం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు అధికారులు నీతి, నిజాయితీ, నిబద్ధతతో విధులు నిర్వహిస్తూ ప్రజలకుఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందించాలి అని సూచించారు. నూతన ఎస్సై సి. కురుమయ్య గతంలో మహబూబ్‌నగర్ సీసీఎస్ ఎస్సైగా విధులు నిర్వహించి, బదిలీపై పానుగల్‌పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటివరకు పానుగల్ ఎస్సైగా పనిచేసిన శ్రీనివాసులు వనపర్తి జిల్లా పోలీసు కార్యా లయానికి బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరిస్తున్న సందర్భంగా ఎస్సై కురుమయ్య మాట్లాడుతూ పానుగల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల సహకారం అత్యంత కీలకం అని తెలిపారు. చట్ట పరిరక్షణలో ప్రజలతో కలిసి ముందుకు సాగుతూ సమర్థవంతమైన పోలీసింగ్ అందిస్తానని పేర్కొన్నారు.

## తాగునీటి సమస్యకు బోర్ డ్రిల్ చేయించిన సర్పంచ్

**నవాబ్‌పేట, మార్చి 13 ప్రభాతవార్త :** గ్రామంలో ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా చూడటం కోసం గ్రామ సర్పంచ్ ఎర్రోళ్ల శంకర్ నూతనంగా గ్రామపంచాయతీకి బోర్ డ్రిల్ చేయించారు. పుష్కలంగా రెండున్నర ఇంచులు వాటర్ రావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. అనంతరం జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి సమక్షంలో కారూరు గ్రామానికి చెందిన పెద్దమోని. శశికల పెద్దమోని పరమేష్ లకు కళ్యాణ లక్ష్మి చెక్కును గ్రామ ప్రజాప్రతినిధుల సమక్షంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామనాయకులు, గ్రామసర్పంచ్ ఎర్రోళ్ల శంకరయ్య, ఉపసర్పంచ్ పెద్దమోని శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి హిర్మాన్, గ్రామపెద్దలు లంకాల శ్రీనివాస్ రెడ్డి, పెద్దమని కృష్ణయ్య, పెద్ద బాయి సేనాపతి, కొత్తకపు జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యార్థులకు పరీక్ష కిట్ల పంపిణీ

**భూత్పూర్, మార్చి 13, ప్రభాతవార్త:** భూత్పూర్ మండలం తాటికొండ జెడ్పీహెచ్‌ఎస్‌లో టెన్త్ విద్యార్థులకు శుక్రవారం పరీక్ష కిట్లను సీనియర్ అడ్వకేట్, లీగల్ అడ్వయిజర్ రవికుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో డిగ్రీకళాశాల లెక్చరర్ శివప్రసాద్, పాఠశాల హెచ్‌ఎం బైకాని బాలు యాదవ్‌తో పాటు ఉపాధ్యాయులు శారద, పద్మజ, సంధ్యారాణి, చెన్నయ్య, వెంకటేష్, లక్ష్మి, స్వరూప, శోభ, సతీష్, కీర్తన తదితరులు పాల్గొన్నారు.

**అన్నాసాగర్‌లో:** భూత్పూర్ మండలం అన్నాసాగర్ గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల టెన్త్ విద్యార్థులకు గ్రామ సర్పంచి ఆల శ్రీకాంత్‌రెడ్డి ప్యాడ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి ఆల మాట్లాడుతూ విద్యార్థులు నేటి నుంచి జరిగే టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని సూచించారు. బైకిబై విద్యార్థులకురు. ఐదు వేలు టెన్త్ పరీక్షల్లో టెన్‌కు టెన్ గ్రేడింగ్ పాయింట్లు తెచ్చుకున్న విద్యార్థులకు ఒక్కొక్కరికి రు. 5వేల పారితోషికం అందిస్తానని కార్యక్రమంలో పాల్గొన్న వార్డు సభ్యుడు చెన్నయ్య ప్రకటించారు. విద్యార్థులు కష్టపడి మంచి మార్కులు సాధించి స్కూల్‌కు మంచిపేరుతేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసులు, వార్డు సభ్యుడు నవీన్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్ పర్సన్ రేణుక, మాజీ ఎంపీటీసీ శేఖర్, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకుడు ఎండి షాకీర్, తెలుగు ఉపాధ్యాయులు గుముడాల చక్రవర్తిగౌడ్ ఇతర ఉపాధ్యాయురాళ్లు జ్యోతి, శారద, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కుమ్మర మొల్లమాంబ జయంతి

**వెల్దండ, మార్చి 13 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో శాలివాహన సంఘం ఆధ్వర్యంలో శ్రీ కుమ్మర మొల్లమాంబ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొల్లమాంబ చిత్రపటానికి శాలివాహన సంఘం అధ్యక్షులు గంగాపురం రమేష్‌తో కలిసి గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ మొల్లమాంబ జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని ఆమె ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు శేఖర్, కోశాధికారి గంగాపురం మల్లేష్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, భీమయ్య, వెంకటేష్, పాండు, యాదగిరి, దశరథం, కృష్ణ, స్వామితో పాటు తదితరులున్నారు.

## పది పరీక్షలకు సర్వం సిద్ధం

**వెల్దండ, మార్చి 13 ప్రభాతవార్త:** నేటి నుండి జరగనున్న పదవ తరగతి పరీక్షలకు సర్వం సిద్ధం చేసినట్లు పరీక్షల నిర్వాహకులు శ్రావణ్ బాలేశ్వర్ రవీందర్ తెలిపారు. మండల కేంద్రంలో రెండు సెంటర్ల ఉన్నాయని జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో 160 మోడల్ పాఠశాలలో 171 మంది విద్యార్థినీ విద్యార్థులు పరీక్ష రాయనున్నట్లు వారు పరీక్ష రాసే నెంబర్ పూర్తి చేశామని విద్యార్థులు ఎటువంటి ఒత్తిడిలకు లోను కాకుండా ప్రశాంతంగా పరీక్ష రాసుకోవాలని విద్యార్థులకు తెలిపారు.

## ఎమ్మెల్యే సహకారంతోనే సీసీ రోడ్డు పనులు

**వెల్దండ, మార్చి 13 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామాన్ని రంగాల్లో అభివృద్ధి పరచుకుంటామని సర్పంచ్ మూడవత్ శారద హరికిషన్ నాయక్ అన్నారు. వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లి గ్రామంలో సీసీ రోడ్డు పనులను మాజీ సర్పంచ్ రామచంద్రారెడ్డి తో కలిసి సర్పంచ్ శారద హరికిషన్ నాయక్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విడతల వారీగా గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని అన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరుణ, ఉప సర్పంచ్ శైలజ, శేఖర్, వార్డు సభ్యులు కిషన్, రమేష్, రవీందర్, నాయకులు గోపాల్ యాదయ్య తదితరులు ఉన్నారు.

